మాను. అన్ని అవకాశాలూ నాకిస్తున్నావుగా?." అంటే, రామయ్యగారికి ములుకు గుచ్చుకొన్నట్లయేది. ఇదెలా తెలిసిందంటారా? కొడుకుమాటలు పూర్తి కాకుండానే ఆయన అనేవాడు: "అలా ఎప్పుడూ మాట్లాడకురా అబ్బాయి, నేను నీకేమి ఇవ్వకల్గుతున్నాను? ఎన్ని డిగ్రీలు సంపాదించినా ఓ ఆఫీసులో కూర్చుని పనిచేయడం నేర్చుకు తీరాలిగా. అదే చేతరావడంలేదు నీకు." తండ్రి బాధకి నవ్వొచ్చింది గోవిందానికి. "నా కలా ఇష్టమే లేదు నాన్నా. నా బుర్ర అందులో పని చెయ్యదు." గోవిందం మధురస్మృతుల జ్ఞాపకాలు ముఖంలో కనిపిస్తూంటే ఇంకా అంటాడు "నాన్నా, ఏదేనా పేరు సంపాదించాలనివుంది నాన్నా. ఎంతమంది అమ్మాయిలో..." గొల్లుగిల్లుకుంటూ చెప్పతలచుకున్నది పూర్తి చేయకుండానే పూరుకుంటాడు గోవిందం.

చిరునవ్వుతో, చుట్ట అవతలపారేసి "ఆడదాని పేరెత్తినే తప్పులేదోయి వెధవాయి" అంటూ రామయ్యగారు అక్కడ కూర్చున్న మాలాంటి వాళ్ళకేసి చూస్తూ "చూడండోయ్, నన్నెలా బుట్టలో వేద్దామని చూస్తూన్నాడో. నా కిప్పుడు అరవై నిండాయి. నా ముఖ్ఖయో ఏటవాడు పుట్టేడు. అప్పటికే యీ ప్రపంచంలో ఎన్ని చూశానో యీ వెధవాయి కేం తెలుసు?

నే యిరవయి అయిదో ఏట పెళ్లి చేసుకున్నాను...దానికీ కారణం యీ హృదయమే అనుకో. తరువాత, యిన్ని సంవత్సరాలుగా యీ హృదయం ఎన్నిసార్లు పగిలిపోయిందో చెప్పలేను. యీ జీవితంలో ఏంచేసినా చివరికి తృప్తి కలుగదనుకో. నేనేదో కాలం గడిపేశానా, యీ గోవిందం చూడు, ఏమేమిటో వాగుతాడు. ఆడవాళ్లట! ప్రేమిస్తే ఏమొస్తుంది? ఏముంది ప్రేమలో? క్షణక్షణం వెయ్యి ముక్కలయిపోడానికి సిద్ధమమే నీ హృదయానికి తోడు యింకోటి కూడా ఎందుకు?...అందులోనూ కోరి తెచ్చుకోవడం! పోనీ అని ఆత్మశాంతికి సంఘసేవ చేద్దాం అనుకొంటే...నిజంగా చేద్దామని దిగేసరికి అదీ చేయలేం. అవునా? అవునా!" అంటూ ప్రశ్నిస్తారు రామయ్యగారు. ఎవరు సమాధానం చెప్తారు? ఎదురుగావున్న నేనుమాత్రం ఏంచేస్తాను?...లా చదువుకొందుకి రైలులో పట్టణంపోతూ, మధ్యలో ప్రేమలోపడి మధ్యలోనే రైలుదిగిపోయిన మామయ్యకొడుకు జ్ఞాపకం వచ్చాడు. ఉద్యోగంలో అంతో యింతో సంపాదించి రిటైరైన రామయ్యగారి హృదయం కొడుకు అభివృద్ధికోసం తహతహ లాడుతూంది. అభివృద్ధి నాకొద్దు; ఆడదాని సాన్నిహిత్యం నాక్కావాలి: అంటూంది గోవిందం హృదయం. అక్కడచేరి మాటలు వింటున్న నాబోట్ల హృదయం- మనకి ఉద్యోగం లేదు; రిటైరయే అదృష్టమెక్కడ? అయినా జీవించాలనే కోర్కెలతో-హృదయం తహతహలాడుతుంది. ఈ హృదయమే లేకుంటే ఎంతహాయి!

కథానిక

# విచిత్ర సంఘర్షణ

"శ్రీనివాస్"

వనజకి వరించిన వరుడితోటే వివాహం అయింది.

బాల్యంనాటి స్నేహితులంతావచ్చి బహుమతులు అందజేస్తున్నారు. తర్వాత అంతా విందు నారగించి వనజవద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోతున్నారు.

కాని తన హృదయంలో చలించి, తనలో వెల్లి తలలెత్తించిన రాము అంతవరకు రాలేదు.... అతనికోసం ఆమె తీరనివ్యధతో క్షోభిస్తోంది. అంతవరకు అతను రాకపోవటానికి కారణం అవగతం కావటంలేదు. మరల పదే పదే మరుపురాని మెలుకువల్తో...ఆమె హృదయం నిరీక్షిస్తోంది. అతడు రాలేదేఅన్న అనుమానంతో తల్లడిల్లి పోతోంది.

వెనువెంటనే చెదరిన చీకట్లమధ్య బెదిరిన గుండెల్తో...బరువైన హృదయవ్యధతో భారంగా "రమణా" అని పిల్చింది...

అంతలో "ఏం అక్కా" అంటూ రమణ వచ్చాడు.

"రాము రాలేదేం?" అని ప్రశ్నించింది.

"అయితే రాలేదా!"

"సమాధానమైనా ఇచ్చాడా?"

"ఇవ్వకేం తర్వాత వస్తా వెళ్ళమన్నాడు"

"అయితే రమణా! 'రాము'ని దగ్గరుండి తీసుకురా...రాకపోతే నామీద ఒట్టని చెప్పు - యీ సంగతి మర్చిపోకేం!" అంటూ రగులుతున్న ఆవేదన్తో...రేగే గుండెలమీద రోదనచేసే అశాంతితో పల్కింది.

"రాము నాదగ్గరకి యిక ఎందుకు వస్తాడు" అనే అనుమానంతో అక్కడే కూలబడిపోయింది కుర్చీలో. ఆనాటి స్నేహాలు...ఆనాటి బాంధవ్యాలు...చిత్ర విచిత్రమైన పరిణామాన్ని తీసుకొచ్చాయి.

వీరిద్దరూ పోట్లాడుకోని రోజు ఉండేదికాదు. చిన్నతనాలు సూటీపోటీ మాట్లతోనే గడిచిపోయింది. కయ్యాలకి కాలుదువ్వటంలో యిద్దరూ సాటిలేని మేటి లనిపించుకొన్నారు. పైకెంత చిలిపిచేష్టలు చేసినా వారిలో వారు అప్యాయతా అనురాగాలు కలిగి—ఒకర్నొకరు అపార్థం చేసికోకుండా హాయిగా కాలం గడిపేవారు.

కాని ఒకరోజు...ఆనాడు ఎందుకో వారిలో పరుగులుతీసే వాత్సల్యవాహిని ఆనకట్టుతాకి ఆగిపోయింది....దీని ఫలితంగా వారిలో వారికి భేదాభిప్రాయాలు...మానసిక మనస్పర్థలు—కళవెళలాడే కలతలు బయల్దేరాయి...అంచేతే వార్లా ఉండిపోయారు. ఉండిపోవలసి వచ్చించికూడా.

ఆ పరిణామానికి యింతగా ఫలితాలు ప్రతిధ్వనిస్తాయిని...రాము యింత పట్టుదలతో పంతగిస్తాడని—మనస్సుని అంతగా కష్టపెట్టుకొంటాడని వనజ ఎప్పుడూ ఊహించలేదు...తన మాటలు మతిలేక తప్పాయేమోనని ఆలోచించలేదు,—అందుకే ఆమె ఈనాడు అంతగా ఆక్రోశిస్తోంది.

అంతలో ఎవరో వస్తున్న సద్దు...

"ఎవరు?"

"రమణ"

"రామూ రాలేదా?" అంది వేడి నిట్టూర్పుతో వనజ.

"ఊహుఁ"

"ఏవన్నాడు?"

"యీవేళ రానన్నాడు"

"అయితే నేను చెప్పినవన్నీ చెప్పవా?"

"అందుకే రేపు రావటానికి ప్రయత్నిస్తానన్నాడు."

ఈ మాటల్లో గూఢార్థం...ఆమెకి అర్థంకాలేదు—ఆంతరంగికంగా ఆమెలో అనుమానం అంచులుదాటి పెల్లుబికింది...

"అందరితోబాటు రాముకూడ వచ్చిచూస్తే ఎంతబాగుండును! అదీకాక అతనిని పరిచయం చేస్తానని ఆయనకి మాటకూడ ఇచ్చానే! అప్పుడే రెండుసార్లు రెట్టించి అడిగారు రాముసంగతి. అతని గురించిఎన్నోచెప్పా! అతడు అందగాడని అలౌకిక వాంఛలు అతనిలో పెల్లుబికి పోతున్నాయని...పరులభావాల్ని సూక్ష్మంగా గ్రహించే సూక్ష్మగ్రాహని...అతని వింతవిచిత్ర ప్రవర్తన తల్చుకొన్నప్పుడల్లా ఆహ్లాదాన్ని అందించే రోజాపుష్పాల్లోని మధురస్మృతి,...మల్లెపూల మార్దవమైన పరిమళం జ్ఞప్తికి వస్తాయి. అదే నాజూకులో...అదే మొండితనంలో...అదే వితండవింత వాదనల్లో...అదే స్నేహంలో...ఎన్నెన్నో చెప్పా!...దీనిని బుజువు చేసికోటం ఎట్లా?" అంటూ గడచిన గతంలో సంఘటనల్ని...జరుగబోయే ప్రవర్తనల్లో పరివర్తనని ఆలోచిస్తూ రాత్రంతా...గడంగా గడిపింది...

రాము రాలేదు, 'మళ్ళీ సాయింకాలం వచ్చేసింది. వెలుగు చీకట్లు కౌగలించుకొని వాతావరణాన్ని మార్చే సాయంసమయంలో రాముంబయలుదేరి వస్తున్నాడు. పచ్చగా ప్రశాంతంగా మామిడి తోరణాల్తో అలంకరించబడ్డ ఆ...పెళ్ళిపందిరిని చేరుకొన్నాడు. లోపలికి వెళ్ళటానికి ప్రయత్నించాడు—కాని సిగ్గు వారించింది ... వెనక్కిపోటానికి ప్రయత్నించాడు. అంతలో వనజ తల్లి వచ్చి "రామూ!" అని పిలిచ్చింది ... ఆమాటకి అప్రయత్నంగా అల్లాగే ఆగిపోయాడు.

"అదేం రామూ! అల్లాసిగ్గుపడతావేం! లోపలికిరా" అంటూరా తీసుకువెళ్ళింది.

"అదేవిటిరామూ! బొత్తిగా రావటం మానేశావ్? అంతా అయిపోయిన వనజ పెళ్ళికి ఇప్పుడా రావటం?"

ఏదో సమాధానం చెప్పటానికి ప్రయత్నించాడు. కాని విఫలుడైయ్యాడు. తల వంచుకొని గోళ్ళు గిల్లుకొంటూ కూర్చొన్నాడు ఏదో ఆలోచిస్తూ...

"పోనీ వనజా నువ్వూ దెబ్బలాడుకొన్నారా ఏవిటి? అయినా అది మీకు మామూలేగా" అంది ఆమె అమాయకంగా.

అంతలో 'వనజ' అమ్మమాటలువిని ఆత్రుతతో వచ్చింది.

"రాము వచ్చాడే" అంది ఒక్కమాటు వనజ తల్లి.

అతనిని తనివితీరా ఆశతో అతని కళ్ళలోకి చూశింది—ఆనాటి స్నేహబాంధవ్యాల్ని జ్ఞప్తికి తెచ్చుకొంటూ.

"రాము ఇంక మనయింటికి రాడమ్మా!" అంది వనజ.

"ఎందుకు-రాడే...! అతను చదివేది పెద్ద చదువైనా అతనికి ఎలాంటి అహంభావం ఉండదు"

"రావాలంటే ఎల్లాగయినా వస్తాడు కాని—" అని ఆగిపోయింది వనజ.

ఏదో నిర్ణయానికివచ్చి రామూ గౌతమునిలా అల్లాగే కూర్చొండి పోయాడు.

"భోజనం చేద్దుగానిలే" అంది వనజ తల్లి.

"ఇప్పుడే భోజనం ఏవిటే—తర్వాత అందరితోపాటూ చేస్తాడులే?...ముందు టిఫిన్ తీసుకురా..." అంది ఎంతో ఆప్యాయంగా వనజ.

"సరే...అయితే" అంటూ లోపలికి వెళ్ళిపోయింది...

* * *

"రాము నామీద కోపం వచ్చిందనుకొంటా!"

"ఎందుకండీ?"

"మాట్లాడరేం?"

"బాగున్నారా?"

"బాగున్నానండీ!" అని ఆమె సమాధానం...

"మీకు వివాహం అయిపోయింది...మీకు నేను చెప్పవలసినవి ఏవీలేవు...అయినా...మీరు నావద్ద తెల్సుకోవాల్సినవి ఏవీలేదుగా...ఆవేళ మీరు అన్నారుకూడా!...యిప్పుడు మీరు నా మూలంగా...పొందవలసిన సానుభూతి ఆనందం అసలేలేవు. యీ చిన్న కానుక తప్ప..." అంటూ తెచ్చిన కానుకని బల్లమీద పెట్టాడు తీసుకోమని.

అతని మాటలు 'వనజ' మూతపడే కంఠంలోంచి కొత్తవేదన సూచిస్తున్నాయి...

"అదేవిటి రామూ...అల్లా మాట్లాడుతున్నావ్? ఏదో అపరిచిత వ్యక్తితో మాట్లాడే సాంగత్యం చూపిస్తావేం?"

"మీరు నిజంగా ఆనాటితో అపరిచిత వ్యక్తులేగా!"

అపరిచిత వ్యక్తి అన్నమాట గొంతులోంచి దిగిపోయింది...గుప్పెడు సడలింది...నేలరాలింది అశ్రుకణం...కొండంత దుఃఖం నెమ్మది నెమ్మదిగా వచ్చిపడుతోంది...వనజ కళ్ళల్లోకి ఎందుకో అతడు ఆమె ముఖంలోకి చూశాడు. వనజ వేడినిట్టూర్పులతో అతనిగుండె బరువెక్కిపోతోంది. ఆనాటి చిలిపి చేష్టలు వనజ వెక్కిరింతలు ఇవన్నీ ఒక్కమాటు ముందుకువచ్చి నాట్యంచేసాయి.వనజ పశ్చాత్తాపంలో పరితాపాన్ని గ్రహించాడు...

"మీరు ప్రశాంత ప్రదేశాల్లో...శాంతి సౌధాల మధ్య...విశ్రాంతితో...వెలుగు బాటన్ని ఏర్పర్చుకొని వెలుగులో జీవించండి" అంటూ రాము వెళ్ళిపోయాడు...

అంతలో వనజతల్లి "రాము ఏడీ?" అంది.

"వెళ్ళిపోయాడమ్మా" అంది క్రుంగిపోయిన మనస్సుతో...

"వెళ్ళిపోయాడా?" అంది నిర్ఘాంతపోతూ...

చిన్నముఖం చేసుకొని చివాల్న గదిలోకి వెళ్ళిపోయింది వనజ. అంతలో భర్తవచ్చి వనజని ఆప్యాయంగా పలకరించి, "రాము వచ్చాడా?" అని అడిగాడు.

వచ్చి వెళ్ళిపోవటానికి తల్లడిల్లి పోయిందా లేతహృదయం.

"అదేం వనజా? ఏంజరిగింది. అతనిని తప్పక చూపిస్తానన్నావుగా?"

"అన్నాను! అనే ఓడిపోయానూడా" అంది.

"అలా ఎందుకు జరిగింది వనూ!" అన్నాడు పరిశంకతో.

"భోజనం చెయ్యండి...నెమ్మదిగా చెబుతాను" అందామె.

"తప్పక చెబుతావుగా..."

"వనూ!" అని పిల్చాడు. ఆమె వచ్చింది... కౌగలించుకొన్నాడు.

"అబ్బ!...వుండండి!" అందామె.

"అయితే ... ఏదో చెబుతా నన్నావుగా!" అన్నాడు మళ్ళీ.

"అయితే యిదిగో మీరే చదువుకోండి." అంటూ ఇదివరలో రాము రాసిన ఉత్తరం యిచ్చింది.

* * *

"వనజకి: నేను వ్రాసిన లేఖని అపార్థం చేసికొని...అంతని పూర్తిగా అర్థంచేసికోకుండా... సగంసగం చదివి అసంపూర్తిగా ఆలోచన చేసారంటే మీకు మహిలో అశాంతే జీవిస్తుంది... ఆవేళ అనుకోని విచిత్రసంఘర్షణచే మనలో అనేక సంవత్సరాల స్నేహబంధాలు తెగిపోయి, అంత వరకు పరిచిత అయిన మీరు అపరిచితులై పోయారు.

ఆవేళ "బాగున్నావా పిల్లా" అన్న ఈమాటలకి అర్థానికి పెడార్థలు పెల్లగించి, తప్పుడర్థాలు తీసి వెనకముందు ఆలోచించకుండా సంకుచిత భావపు హృదయాన్ని చేబట్టారు...గడచిన చలి—బిలి అల్లర్లని మైకంలోపైమర్చి నన్ను నానామాటలు అన్నారు.

"అదేవిటె వనజా! ఎవరో తెల్సుకోనే మాట్లాడుతున్నావా? లేకపోతే తెల్సుకో" అని నేనంటే

"నీలో తెల్సుకోనేదేమీలేదు" అని నిర్మోహమాటంగా మాట్లాడారు.

తలవని తలంపుగా...మీలోని నివురుకప్పిన నిప్పు బుసలుకొట్టింది...రణధ్వని చేసింది...కాల సర్పమై కాటువేసింది—అంతా అయిపోయింది... తర్వాత మీరిప్పుడు ఏదో విచారిస్తే లాభం?

మీకు తీరని అవమానం, అగౌరవంచేస్తే నేను పొందే అమరసుఖం ఏవిటో నా కర్థంకావటంలేదు!

దీన్నిగురించి కొంచమయినా ఆలోచించారా? గడచిన రోజుల్ని జ్ఞప్తికి తెచ్చుకొన్నారా?

వనజ వినమ్ర భావశీల...పరుల భావాలు సూక్ష్మంగా అవగాహన చేసుకొనే సూక్ష్మగాహి— అంటూ హృదయంలో ఊహించుకొని నిత్యం... మిమ్మల్ని... నిత్యపూజారినై పూజించేవాడిని— ఏమయితేనేం! మీలో మహాప్రళయం ముంచుకొచ్చింది...అచైతన్యరేఖ మీలో లీనమయింది. ఆక్రోశాగ్ని రేఖలు మీలో కమ్ముకొంటున్నాయి... పరిస్థితి అంతా తారుమారు అయిపోయింది...

ఆ పరిచయం ... ఆ విశ్వాసం ... ఆ విజ్ఞానం ఆ జ్ఞాపకం...ఆ చిరునవ్వు ... మధ్యమధ్య రసాభాసలు...మన చిగురు తొడిగిన గుండెల గులాబీ మెరుపులు...ఒకటేమిటి? అన్నీమర్చిపోయారు... అందుకే దూరంగా ఉండిపోయాం...వుండిపోవలసి వచ్చిందికూడా!

మంచిని మంచిగా తీసుకోకుండా చెడ్డని చూపించారు ... మీకు నా మూలంగావచ్చిన రాబడి ఇంతే! యీ రాబడిలో వచ్చిన ప్రతిఫలాన్ని క్షమించండి!..క్షమించకపోతే మిమ్మల్ని క్షమార్పణ వేడుకొంటున్నా ... యిప్పుడయినా క్షమిస్తారా?

మరల మనం మాట్లాడుకోటం అనేది సంభవిస్తే మీకు, నా మూలంగా రావలసిన వడ్డీ ఆప్యాయతాను రాగాలులేని గౌరవం మర్యాద... హోదాలేగా...అవి తప్పకయిస్తాను!

జరిగేవిజరిగి పోయాయి...యిప్పుడు విచారిస్తే లాభం ఏవుంటుంది. మీరెప్పుడు శాంతి, ప్రశాంతి విశ్రాంతుల్లో కళలు కనుగొంటూ కలకాలం వర్ధిల్లండి.

ఏమయితేనేం...అశాంతి మహిలోనే జీవిస్తోందిగా. సెలవు రాము.

* * *

ఎంతో పరిపక్వం పొందిన పరివర్తనతో... కదలని కళాకారుని శిల్పంలా అల్లాగే ఉండిపోయాడు భర్త; ఉత్తరంముగించాక.

"అందుకే రాము నాకు దూరంగా ఉండిపోయాడు"అంటూ పట్టరాని దుఃఖంతో అంది వనజ.

"మీతో ఎలామాట్లాడినా కష్టమే"అన్నాడు భర్త—రామును తన పక్షంచేసికొని...

"లేచినరోజు అలాంటిదయింది—ఏంచెయ్యను? ఆవేళ రాము విషయంలో చాల తొందరపడ్డాను!" అంది...

ఈ మాటలల్తో నక్షత్రాలు నిద్రనుండి మేల్కొన్నాయి...భర్త ఆత్మసహితం కదలి... చలించి...నిల్చిపోయింది. ★